

తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలి 8లో



మహిళపై దాడి చేసిన యువకుని అరెస్టు 8లో



స్థాయీ సంఘం ఎన్నిక ఉంటుందా? 8లో

న్యూస్‌రీల్

నేవీ వెటరన్ క్రీడాకారుడికి ప్రశంసలు



వెటరన్ క్రీడాకారుడు సీడీఆర్ శ్రీరాములుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న నేవీ అధికారులు

సీతంపేట: నేవీ విశ్రాంత ఉద్యోగి, వెటరన్ క్రీడాకారుడు సీడీఆర్ వి.శ్రీరాములు ప్రపంచ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆరు బంగారు, 3 రజత పతకాలు సాధించారు. ఇప్పటివరకు ఆయన పలు జాతీయ, అంతర్జాతీయ ఈవెంట్లలో 50కి పైగా పతకాలు గెలుపొందారు. ఈ సందర్భంగా శ్రీరాములును వర్చువల్‌గా ఏడీఎం దినేష్ త్రిపాఠి అభినందించారు. స్వీడన్‌లోని గోథెన్ బర్గ్‌లో జరగనున్న ప్రపంచ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్నందుకు శ్రీరాములుకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేవీ అధికారులు శ్రీరాములుకు క్యాప్, ప్రశంసాపత్రం అందజేశారు.

ఎన్టీపీసీ సింహాద్రికి మరో అవార్డు

పరవాడ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎన్టీపీసీ సింహాద్రికి బ్యాంకాక్‌కు చెందిన గ్రీన్‌టెక్ ఫౌండేషన్ నుంచి గ్లోబల్ ఈహెచ్‌ఎస్ అవార్డు–2024 లభించింది. ఎన్టీపీసీ పర్యావరణ పరిరక్షణకు నిరంతరం కృషి చేయడంతో పాటు ఉత్తమ పద్ధతులు అవలంబిస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రీన్‌టెక్ ఫౌండేషన్ షీల్డ్, మెరిట్ సర్టిఫికెట్‌ను ఎన్టీపీసీకి అందజేసింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మహారాణిపేట: భారీ వర్షాలు, ఈదురు గాలులు, సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సూచించారు. కలెక్టర్ తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారుల సమావేశం నిర్వహించారు. వర్షాలకు తగిన విధంగా సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఫ్రైడే డ్రైడేగా పాటించాలన్నారు. మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని,వసతి గృహాల్లో మెస్‌లు ఏర్పాటు చేయాలన్నారు. డీఆర్వో కె.మోహన్‌కుమార్,డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు పాల్గొన్నారు

రైతు బజార్లలో టమాటా విక్రయాలు

మహారాణిపేట: జిల్లాలోని అన్ని రైతు బజార్లలో శుక్రవారం నుంచి కిలో టమాటా రూ.58కి విక్రయించనున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. రాష్ట్రంలో టమాటా ధర విపరీతంగా పెరుగుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. జిల్లాకు అవసరమైన టమాటాలను చిత్తూరు నుంచి రప్పించినట్లు తెలిపారు.

నేటి నుంచి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన

ఎంవీపీకాలనీ: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జె.హుస్సేన్ నాయక్ 19, 20 తేదీల్లో విశాఖలో పర్యటిస్తారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తెలిపారు. పర్యటనలో భాగంగా విశాఖ స్టీల్‌ప్లాంట్, పోర్టు ట్రస్ట్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తారన్నారు. ఎంవీపీకాలనీలోని గిరిజన భవన్‌లో 20వ తేదీ సాయంత్రం అఖిల భారత గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన్ని సత్కరించనున్నట్లు వెల్లడించారు.

రేపే గిరి ప్రదక్షిణ







గిరి ప్రదక్షిణ మార్గం మ్యాప్

అప్పన్నా.. అని ఆర్తితో పిలిస్తే అభయహస్తం అందించే స్వామి శ్రీ వరాహ లక్ష్మీ నృసింహుడు. వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని శ్రీ మహా విష్ణువు శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిగా వెలసిన ఆధ్యాత్మిక క్షేత్రం ఇది. చందన పరిమళాలు, సంపెంగ సౌరభాలతో శోభిల్లుతున్న సింహాచల క్షేత్రంలోని ప్రధాన ఉత్సవాల్లో ఒకటి గిరి ప్రదక్షిణ. సింహగిరి చుట్టూ 32 కిలోమీటర్ల మేర కాలినడకన ఒక్కసారి ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణతో సమానమని భక్తులు భావిస్తారు. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని చేపట్టనున్న గిరి ప్రదక్షిణ శనివారం ప్రారంభం కానుంది. లక్షలాదిగా విచ్చేసే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

- సుమారు 5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా..
- సాయంత్రం 4 గంటలకు తొలిపావంచా వద్ద స్వామి పుష్పరథం ప్రారంభం
- 21న తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయ ప్రదక్షిణలకు అనుమతి
- అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి కొలువైన సింహగిరి ప్రదక్షిణ(గిరి ప్రదక్షిణ) శనివారం జరగనుంది. ఈసారి దాదాపు 5 లక్షల మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో సింహాచలం, రెవెన్యూ, జీవీఎంసీ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, విద్యుత్, ఫైర్, ఎక్సైజ్ తదితర శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులు సేద తీరేందుకు 29 ప్రాంతాల్లో స్టాల్స్, 22 ప్రదేశాల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా 290 తాత్కాలిక మరుగుదొడ్లు, 11 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, 12 చోట్ల 17 అంబులెన్స్‌లు, 9 జనరేటర్లు, ఆరు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. కాగా ఏర్పాట్లకు గురువారం వరుణుడు అడ్డంకిగా నిలవడంతో.. కొంత మేర ఇబ్బందులు ఎదురయ్యాయి.

సాయంత్రం 4 గం.కు పుష్పరథం ప్రారంభం

కొండదిగువ స్వామి తొలిపావంచా వద్ద నుంచి శనివారం సాయంత్రం 4 గంటలకు పుష్పరథం ప్రారంభవుతుంది. స్వామి మూలవిరాట్, ఉత్సవమూర్తులు కొలువుదీరిన ప్రచార రథం బయలుదేరుతుంది. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులంతా ఆ సమయానికి తొలిపావంచా వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది.

ఇవీ దర్శన సమయాలు

20వ తేదీ ఉదయమే గిరి ప్రదక్షిణ ప్రారంభించి అదే రోజు రాత్రికి తిరిగి సింహాచలం చేరుకునే భక్తులకు రాత్రి 10 గంటల వరకు దర్శనాలు లభిస్తాయి. 21 ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు అందజేస్తారు. తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు, రాత్రి 8.30 గంటల నుంచి 9 వరకు భక్తులకు – మిగతా 8లో

కంట్రోల్ రూమ్‌లిక్కడే..

సింహాచలంలోని కొండదిగువ కలశం జంక్షన్, అడవివరం, హనుమంతవాక, అప్పుఘర్, మాధవదార, ఎన్‌ఎస్టీఎల్..

ఉచిత ప్రయాణం

21వ తేదీ ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొండపై నుంచి దిగువకు భక్తులను దేవస్థానం బస్సులతో పాటు, దేవస్థానం నగదు చెల్లించిన 45 ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా చేరవేస్తారు.

పుష్పరథం తిరిగే మార్గం

తొలిపావంచా, అడవివరం, పైనాపిల్‌కాలనీ, సెంట్రల్ జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటిపార్కు, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, ఎస్‌ఏడీ కొత్తరోడ్డు, గోపాలపట్నం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకుంటుంది.

భక్తులు ప్రదక్షిణ చేసే మార్గం

సింహాచలంలోని తొలి పావంచా, అడవివరం, పైనాపిల్ కాలనీ, సెంట్రల్ జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్క్, అప్పుఘర్, ఎంవీపీకాలనీ, సీతమ్మధార, నరసింహనగర్, పోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, కప్పరాడ, మురళీనగర్, మాధవధార, ఆర్‌అండ్‌బీ కార్యాలయం, లక్ష్మీనగర్, కుమారి కల్యాణ మండపం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకోవాలి.

13,000 మంది బాధితులు.. రూ.100 కోట్లు నష్టం

- జిల్లా వాసులపై సైబర్ నేరగాళ్ల పడగ
- బాధితుల ఫిర్యాదుతో బ్యాంకుల్లో రూ.18 కోట్లు ఫ్రీజ్
- కోర్టు అనుమతితో 150 మంది బాధితులకు రూ.4.65 కోట్లు అందజేత
- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి వెల్లడి



నమూనా చెక్కును బాధితులతో కలిసి ఆవిష్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: విశాఖ జిల్లాలో 13,000 మంది బాధితులు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి రూ.100 కోట్ల మేర నష్టపోయినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. సైబర్ క్రైమ్ కేసుల్లో హోల్డ్ చేసిన నగదును బాధితులకు తిరిగి ఇచ్చేందుకు మనీ రిఫండ్ మేళాను గురువారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ..సైబర్ కేటుగాళ్లు రోజుకో కొత్త తరహాలో ప్రజలను మోసం చేసి దోచుకుంటున్నారని చెప్పారు. నష్టం జరిగిన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు గానీ, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో గానీ ఫిర్యాదు చేస్తే వెంటనే పోయిన నగదును ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. దాన్ని తిరిగి బాధితులకు ఇప్పించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఛేదించిన కేసుల్లో రూ.18 కోట్లు ఫ్రీజ్ చేసినట్లు వెల్లడించారు.

నగదు రాకుంటే సంప్రదించండి

ఇప్పటివరకు పలు కేసుల్లో సైబర్ నేరగాళ్లకు సంబంధించిన పలు బ్యాంకుల్లో ఉన్న రూ.4.65 కోట్లను ఫ్రీజ్ చేసినట్లు చెప్పారు. వాటిని బాధితులకు ఇప్పించడానికి సంబంధిత జిల్లా కోర్టు అనుమతి అవసరమని తెలిపారు. దీని కోసం జాయింట్ సీపీ ఫక్కీరప్ప, సైబర్ క్రైమ్ సీఐ భవాని ప్రసాద్ కృషి చేసిన కారణంగానే ఈ మేళా నిర్వహణకు సాధ్యమైందన్నారు. బాధితులకు 10, 15 రోజుల్లో బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని చెప్పారు. ఎవరికైనా డబ్బులు పడని పక్షంలో సైబర్ క్రైమ్ సీఐ 9490617917 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింక్స్‌ను క్లిక్ చేయవద్దని చెప్పారు. సైబర్ నేరాల నియంత్రణకు కాలేజీలు, ప్రధాన జంక్షన్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.కార్యక్రమంలో జాయింట్ సీపీ ఫక్కీరప్ప, డీసీపీ–2 తుహీన్ సిన్హా, సైబర్ క్రైమ్ సీఐ భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఏయూ ఇన్‌చార్జ్ వీసీగా శశిభూషణ రావు



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొ.శశిభూషణరావు

సాక్షి, విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ జి.శశిభూషణ రావును నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీసీ చాంబర్‌లో ఇన్‌చార్జి వీసీగా గురువారం రాత్రి ఆయన పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఏయూ ఈసీఈ విభాగం సీనియర్ ప్రొఫెసర్‌గా, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొ.శశిభూషణ రావు ప్రస్తుతం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. 35 సంవత్సరాల సుదీర్ఘ బోధన అనుభవం ఉన్న ఈయన ఏయూలో ఈసీఈలో బీటెక్, జేఎన్‌టీయూలో ఎంటెక్ పూర్తి చేశారు. ఉస్మానియా వర్సిటీ నుంచి పీహెచ్‌డీలను పూర్తిచేశారు. ఆయనకు 5 పేటెంట్లు సైతం ఉన్నాయి. ఆయన పర్యవేక్షణలో 51 మంది డాక్టరేట్లను అందుకున్నారు. 275కు పైగా పరిశోధన పత్రాలను, వివిధ స్కోపస్ జర్నల్స్ ప్రచురించారు. 5 పాఠ్యపుస్తకాలను, వివిధ పుస్తకాలలో 11 చాప్టర్లు సైతం రచించారు. 2008లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ బెస్ట్ అకడమీషియన్ అవార్డును, బెస్ట్ రీసెర్చర్ అవార్డును అందుకున్నారు. ఆయన పర్యవేక్షణలో 9 రీసెర్చ్ ప్రాజెక్టులను పూర్తిచేశారు. వివిధ జర్నల్స్‌కు ఎడిటర్‌గా వ్యవహరించారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, వివిధ విభాగాల ప్రిన్సిపాళ్లు నరసింహారావు, ఎంవీఆర్ రాజు, గౌరీశంకర్, విజయ్ మోహన్, చల్లా రామకృష్ణ, వర్సిటీ ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఖాకీలకే రక్షణ కరువు..!

- కూటమి ప్రభుత్వంలో రెచ్చిపోతున్న పచ్చమూకలు
- మొన్న కానిస్టేబుల్ అప్పారావుపై దాడి..
- నిన్న ట్రాఫిక్ పోలీసులపై రెచ్చిపోయిన అచ్చెన్న అనుచరులు
- సాక్షి కథనంతో హడావుడిగా కేసు నమోదు, అరెస్టు



పోలీసులతో గొడవపడుతున్న టీడీపీ నాయకులు

విశాఖ సిటీ: ప్రజలకు రక్షణకు కల్పించాల్సిన పోలీసులకే రక్షణ కరువైంది. కూటమి ప్రభుత్వంలో పచ్చ మూకలు.. ప్రజలు, ప్రత్యర్థి పార్టీల నేతలనే కాకుండా ఖాకీలను సైతం విడిచిపెట్టడం లేదు. ఎన్నికల ఫలితాలు వచ్చిన క్షణం నుంచి ఉమ్మడి విశాఖలో తెలుగుతమ్ముళ్లు రెచ్చిపోతున్నా.. దాడులకు తెగబడుతున్నా పోలీసులు చోద్యం చూస్తూ వచ్చారు. తాజాగా ఇప్పుడు వారిపైనే తిరగబడే దుస్సాహసానికి ఒడిగట్టారు. పచ్చ బిళ్ల పట్టుకొని వెళితే అధికారులు పనిచేయాల్సిందే అన్న మంత్రి అచ్చెన్నాయుడు అనుచరులే డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులపై చిందులు తొక్కి.. ఎస్‌ఐ, సీఐలనే కాకుండా సీపీని సైతం వీఆర్‌కు పంపిస్తామని బెదిరింపులకు పాల్పడితే.. కేసు పెట్టడానికి మీనమేషాలు లెక్కించారు. ముందు కేవలం డ్రైవర్‌పై మాత్రమే కేసు పెట్టిన పోలీసులు.. సాక్షి కథనంతో పోలీసులపై రెచ్చి పోయిన మరో నలుగురిపై కేసులు నమోదు చేశారు.

వరుస దాడులు :

ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి పెదవాల్తేరు జంక్షన్‌లో కానిస్టేబుల్ అప్పారావుపై మద్యం మత్తులో ఓ వ్యక్తి దాడి చేశాడు. ఈ ఘటనలో అప్పారావు చేయి విరిగిపోయింది. 16వ తేదీ రాత్రి 11.45 గంటలకు మద్దిలపాలెం జంక్షన్‌లో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఆ సమయంలో వెంకోజీపాలెం నుంచి మద్దిలపాలెం వస్తున్న కారును ఆపి ఆల్కోమీటర్ ఊదమని చెప్పగా.. లోపల ఉన్న మరో నలుగురు పోలీసులపై చిందులు తొక్కారు. తాము అచ్చెన్న అనుచరులమని, అందరినీ వీఆర్‌కు పంపిస్తామని బెదిరింపులకు దిగారు. ఒకవైపు టీడీపీ నేతలు పోలీసులపై రెచ్చిపోతుంటే.. పోలీసులు మాత్రం అలా చేయకూడదని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ తతంగమంతా అక్కడున్న వారు మొబైల్‌లో చిత్రీకరించారు. ఆ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ.. వారి నుంచి ఎటువంటి ఆదేశాలు లేకపోవడంతో పోలీసులు ముందు కేవలం డ్రైవర్ బొమ్మాలి మురళీపై కేసు పెట్టి ఊరుకున్నారు. ఈ విషయంపై సాక్షి ప్రచురించిన కథనంతో ఉన్నతాధికారుల్లో కదలిక వచ్చింది. కారులో ఉన్న శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలానికి చెందిన బొచ్చు మల్లేష్, పాలాకి దిల్లేశ్వరరావు, బళ్ల బుజ్జి బూరి గిరీష్‌లను అరెస్టు చేశారు.

హడావుడిగా ప్రెస్‌మీట్

పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన టీడీపీ నేతలపై కేసు నమోదుకు మీనమేషాలు లెక్కించిన పోలీసులు సాక్షి కథనంతో హడావుడిగా గురువారం ప్రెస్‌మీట్ పెట్టారు. ఏడీసీపీ(ట్రాఫిక్) శ్రీనివాసరావు కేసు వివరాలను వెల్లడించారు. డ్రైవర్‌తో పాటు మిగిలిన నలుగురిని అరెస్టు చేసినట్టు చెప్పారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

తడిసి ముద్దయిన నగరం



విశాఖ సిటీ: నగరం తడిసి ముద్దయింది. తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా విశాఖ జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉంది. అప్పుడప్పుడు చిరుజల్లులు పలకరిస్తున్నా.. వేడి మాత్రం కాస్త ఉక్కిరిబిక్కిరి చేసింది. గురువారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అయితే ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ఉద్యోగులు, పనుల నిమిత్తం వెళ్లే వారు కాస్త ఇబ్బంది పడ్డారు. అల్పపీడనం కారణంగా మరో అయిదు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. గంభీరంలో 19.5 మి.మీ., పెందుర్తిలో 16.5 , వాంబేకాలనీలో 16.0, ఆరిలోవ–15.3 మి.మీ., వర్షం కురిసింది.

214 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితులతో అధికారులు

పెందుర్తి: ఒడిశా నుంచి కోలకతాకు గంజాయి తరలిస్తున్న ముఠాను పెందుర్తి సెబ్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 214 కిలోల గంజాయిని, బొలెరో, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో సేకరించిన గంజాయిని పెందుర్తి మీదుగా కోలకతాకు తరలించేందుకు బొలెరో వాహనంలో నలుగురు ముఠా సభ్యులు బయలుదేరారు. పెందుర్తి సమీపంలోని ఆ వాహనం ఆగిపోయింది. దీంతో స్మగ్లర్లు స్కూటీపై గంజాయి బస్తాలను తరలించేందుకు ప్రయత్నం చేశారు. పెందుర్తి సమీపంలో గస్తీ కాస్తున్న సెబ్ అధికారులు దీన్ని గమనించి తనిఖీ చేశారు. దీంతో గంజాయి పట్టుబడింది. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ సీఐ ఎం.సరోజదేవి తెలిపారు. దాడిలో ఎస్‌ఐ మహేష్‌బాబు, సిబ్బంది అప్పారావు, శివ, అశోక్, మధుసూదన్, నాయుడు, రామలక్ష్మి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా తిరుగు రథయాత్ర

- జై జగన్నాథ్ స్మరణతో మార్మోగిన రహదారులు
- నేడు సంప్రోక్షణ, పీఠారోహణ



స్వామి తిరుగు రథయాత్రలో పాల్గొన్న భక్తులు(ఇన్‌సెట్) బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి

డాబాగార్డెన్స్: దేవదేవుడు.. జగన్నాథుడు.. తిరువీధుల్లో మరోసారి మెరిసిపోయాడు. భక్తుల కోలాహలం నడుమ.. వరుణుడు వెంట రాగా.. తన సొంత ఇంటికి పయనమయ్యాడు. సోదరి సుభద్ర, సోదరుడు బలభద్రుడితో కలిసి 11 రోజుల కిందట గుండిచా మందిరానికి వచ్చిన జగన్నాథుడు.. తిరిగి నయనమనోహరంగా స్వగృహానికి తరలివెళ్లాడు. వైదికులు విశేష పూజలు నిర్వహించి వివిధ పుష్పాలతో అలంకరించిన రథంపై స్వామిని అధిష్ఠింపజేయగా.. వేలాది మంది భక్తులు ఆనందోత్సాహాలతో రథాన్ని లాగి స్వామిని ఆలయానికి చేర్చారు.

టర్నర్ చౌల్ట్రీలోని గుండిచా మందిరంలో 11 రోజులుగా భక్తులతో పూజలందుకున్న సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు గురువారం తిరిగి ఆలయానికి చేరుకున్నాడు. టర్నర్ చౌల్ట్రీ వద్ద ప్రారంభమైన తిరుగు రథయాత్ర ఆంజనేయస్వామి ఆలయం, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు మీదుగా టౌన్ కొత్తరోడ్డులోని జగన్నాథస్వామి ఆలయం వరకు అంగరంగ వైభవంగా సాగింది. దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఉత్సవ అధికారి కె.శిరీష, ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి, పలు ఆలయాల ఈవోలు, పలువురు ప్రముఖులు గుండిచా మండపంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మూలవిరాట్‌లను గుండిచా మండపం నుంచి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ బయటకు తోడ్కొని వచ్చారు. కనులవిందుగా అలంకరించిన రథంపైకి స్వామిని చేర్చారు. స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు.. దారి పొడవునా ఆయనకు బ్రహ్మరథం పట్టారు. రథం లాగేందుకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌తో పాటు వేలాది మంది పోటీపడ్డారు. టర్నర్ చౌల్ట్రీ నుంచి బయలుదేరిన రథం మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ నయనమనోహరంగా సాగింది. జగన్నాథ స్వామి ప్రార్థనాగాన సంఘం సభ్యులు విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా, గోవిందనామ సంకీర్తనలు ఆలపించగా.. సన్నాయి మేళ తాళాలు, జగన్నాథ నామ స్మరణతో రహదారులు మార్మోగాయి. స్వామికి శుక్రవారం సంప్రోక్షణ, పీఠారోహణ నిర్వహిస్తున్నట్లు అర్చకులు జగన్నాథాచార్యులు, రంగనాథాచార్యులు, ఏడిద సురేష్‌బాబు తెలిపారు. తర్వాత యథాస్థానంలోకి స్వామిని చేరుస్తారు. తిరుగు రథయాత్ర నేపథ్యంలో టర్నర్ చౌల్ట్రీ నుంచి టౌన్‌కొత్తరోడ్డు వరకు ట్రాఫిక్ మళ్లించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఎటువంటి వాహనాలు ప్రవేశించకుండా పోలీసులు రహదారిని మూసివేశారు. జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వెళ్లే వాహనాలు టర్నర్ చౌల్ట్రీ వద్దనే దారి మళ్లించి పోలీస్ బ్యారెక్స్, డాల్ఫిన్ హోటల్ జంక్షన్, 75 ఫీట్ రోడ్డు, రామకృష్ణా జంక్షన్, స్టేడియం రోడ్డు, పోర్టు రోడ్డు మీదుగా టౌన్‌కొత్త రోడ్డుకు వెళ్లేలా చర్యలు చేపట్టారు.

స్థాయీ సంఘం ఎన్నిక ఉంటుందా? లేదా?

ఈ నెల 25తో ముగియనున్న సభ్యుల పదవీ కాలం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జీవో 49 మేరకు స్థాయీ సంఘానికి 10 మంది సభ్యులుగా నిర్ణయించారు. అప్పటి నుంచి ఏటా జూలైలో స్థాయీ సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. గతేడాది ఇదే నెల 19న ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఫలితాలు ప్రకటించారు. ఆ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించింది. అన్ని స్థానాలు కైవసం చేసుకుంది. సభ్యులుగా అక్కరమాని పద్మ, గుడ్ల విజయసాయి, ఉరుకూటి నారాయణరావు, కోడిగుడ్ల పూర్ణిమ, కంటిపాము కామేశ్వరి, చల్లా రజని, బల్లా లక్ష్మణరావు, భూపతిరాజు సుజాత, బట్టు సూర్యకుమారి, పీలా లక్ష్మీ సౌజన్య ఎన్నికయ్యారు. వీరి పదవీకాలం ఈ నెల 25తో ముగియనుంది. ఈ మేరకు నూతన సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి దాదాపు 40 రోజులు పైబడింది. ఇప్పటికే స్థాయీ సంఘం ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా.. ప్రభుత్వం వెనుకడుగు వేస్తున్నట్టు కనిపిస్తోంది. అంతెందుకు జీవీఎంసీకి సంబంధించి కౌన్సిల్ సమావేశం గానీ, స్థాయీ సంఘ సమావేశం గానీ నిర్వహించకపోవడం గమనార్హం. మేయర్ హరి వెంకటకుమారి కౌన్సిల్ ఏర్పాటు చేయాలని, స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించాలని, స్టాండింగ్ కమిటీకి సంబంధించి నూతన సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వాలని కమిషనర్‌కు లేఖ రాసినా స్పందన లేదు. ఈ దఫా స్థాయీ సంఘం ఎన్నికలు నిర్వహిస్తారా? లేదా? వేచి చూడాల్సిందే..

22 నుంచి శిక్షా సప్తాహ్

విశాఖ విద్య: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి 28 వరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని సమగ్ర శిక్ష ఏపీసీ బి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

రేపే గిరి ప్రదక్షిణ

▶ 7వ పేజీ తరువాయి

దర్శనాలు లభిస్తాయి.

21న ఆలయ ప్రదక్షిణలు

సింహగిరిపై 21న ఆలయ ప్రదక్షిణలు చేసే భక్తులను తెల్లవారుజామున 3 గంటల నుంచి అనుమతిస్తారు. భక్తులంతా ఆలయ బాహ్య ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి ఉంటుంది.

స్టాళ్లు ఏర్పాటు చేసే ప్రాంతాలివే..

సింహచలంలోని తొలి పావంచా, అడవివరం మైదానం, పైనాపిల్ కాలనీ, సెంట్రల్ జైల్, ముడసర్లోవ పార్కు, చినగదిలి రోడ్డు, పెదగదిలి, ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి, హనుమంతవాక జంక్షన్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు, అప్పుఘర్, వెంకోజీపాలెంలోని



ఆంజనేయస్వామి ఆలయం, సీతమ్మధారలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం, నరసింహనగర్, సింగాలమ్మ ఆలయం డాక్‌యార్డ్ క్వార్టర్స్, పోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్, మురళీనగర్, మాధవధార, ఆర్అండ్‌బీ, ఎస్ఏడీ జంక్షన్, లక్ష్మీనగర్, కుమారి కల్యాణ మండపం, శ్రీనివాసనగర్, పాత గోశాల జంక్షన్, శ్రీదేవి కాంప్లెక్స్, సింహగిరిమెట్ల మార్గం, కొండపైన బస్టాండ్ ఏరియా..

మరుగుదొడ్లు ఇక్కడే..

తొలి పావంచా, అడవివరం గ్రౌండ్, పైనాపిల్ కాలనీ, సెంట్రల్ జైల్, ముడసర్లోవ, చినగదిలి, పెదగదిలి, ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి, అప్పుఘర్, వెంకోజీపాలెం, డాక్‌యార్డ్ క్వార్టర్స్, పోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్, మాధవధార, కుమారి కల్యాణ మండపం, శ్రీనివాసనగర్, పాత గోశాల జంక్షన్, శ్రీదేవి కాంప్లెక్స్, మెట్లమార్గం..

వైద్య శిబిరాలివే..

తొలి పావంచా, ముడసర్లోవ పార్కు, జోడుగుళ్లపాలెం, అప్పుఘర్, వెంకోజీపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయం, పోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, మాధవధార, ఎస్ఏడీ జంక్షన్, కుమారి కల్యాణమండపం, పాత గోశాల జంక్షన్, సింహగిరి మెట్ల మార్గం..

విశేషంగా ఏర్పాట్లు

- సింహాచలంలోని తొలిపావంచా వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు 50 క్యూలు, 80 ఇనుప గడ్డర్లు సిద్ధం చేస్తున్నారు. అడవివరం నుంచి హనుమంతవాక వెళ్లే బీఆర్‌టీఎస్ మార్గంలోని కొత్త ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద 20 ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేస్తున్నారు.
- సింహగిరి చుట్టూ ఏర్పాటు చేసిన స్టాళ్లలో జీవీఎంసీ మంచినీరు అందిస్తుంది. పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణను జీవీఎంసీ చేపడుతుంది.
- అప్పుఘర్ వద్ద స్నానాలు ఆచరించే భక్తుల సౌకర్యార్థం 40 తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, 80 ఎల్‌ఈడీ దీపాలు, ఓ జనరేటర్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ 20 మంది గజ ఈతగాళ్లు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తారు.
- మాధవధార వద్ద 40 తాత్కాలిక టాయిలెట్లు, ఓ వైద్య శిబిరం, 50 ఎల్‌ఈడీ లైట్లు, ఓ జనరేటర్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంను సిద్ధం చేస్తున్నారు.
- 21న భక్తులందరికీ అన్నప్రసాద భవనం వద్ద కదంబం, దద్దోజనం అన్న ప్రసాదంగా అందజేస్తారు.
- కొండదిగువన 29, కొండపైన 3 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు.
- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.
- గిరి ప్రదక్షిణ మార్గంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఆ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.
- గిరి ప్రదక్షిణ మార్గంలో 20వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 21వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయనున్నారు.
- 21న ఆలయ ప్రదక్షిణలకు సంబంధించి ఉత్తర రాజగోపురం, దక్షిణ రాజగోపురం వద్ద వంతెనలను సిద్ధం చేస్తున్నారు. బ్రిడ్జిలపై నుంచి ప్రదక్షిణలు చేసే భక్తులు, కింద నుంచి దర్శనానికి భక్తులు వెళ్లేలా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

విశాఖ సిటీ: సింహాచలం గిరి ప్రదక్షిణకు పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తుతో పాటు ముందస్తు ప్రణాళికతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నామని.. ప్రజలు ఈ మార్పులను గమనించి సహకరించాలని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి విజ్ఞప్తి చేశారు.

పోలీసుల సూచనలివే..

- గిరి ప్రదక్షిణ జరిగే ప్రాంతాల్లో 20, 21 తేదీల్లో ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలి.
- 20వ తేదీ ఉదయం నుంచి అడవివరం, పాత గోశాల జంక్షన్ మధ్య ఎటువంటి వాహనాలను అనుమతించరు. ప్రత్యామ్నాయంగా వేపగుంట, పెందుర్తి, అక్కిరెడ్డిపాలెం, దువ్వపాలెం జంక్షన్ మీదుగా ప్రయాణించాలి.
- అడవివరం నుంచి గిరి ప్రదక్షిణకు తొలి పావంచా వద్దకు వచ్చే భక్తులు వారి వాహనాలను అడవివరం జంక్షన్ వద్ద పార్కింగ్ చేయాలి. అక్కడి నుంచి కాలినడకన రావి చెట్టు జంక్షన్ నుంచి గాంధీనగర్, కోనేరు మీదుగా కలశం జంక్షన్‌కు చేరుకోవాలి.
- వేపగుంట, సింహపురికాలనీ నుంచి వచ్చే భక్తులు పాత గోశాల వద్ద పార్కింగ్ చేసుకుని తొలి పావంచాకు వెళ్లాలి.
- గోపాలపట్నం పెట్రోల్ బంక్ జంక్షన్ నుంచి పాత గోశాల వరకు ఎటువంటి వాహనాలకు అనుమతి లేదు.
- అనకాపల్లి నుంచి శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లే వాహన చోదకులను విశాఖ సిటీలోకి అనుమతించరు. వీరు లంకెలపాలెం, సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం వైపు ప్రయాణించాలి.
- శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచే అనకాపల్లి వైపు వెళ్లే వాహనచోదకులు నగరంలోకి రాకుండా ఆనందపురం, పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి చేరుకోవాలి.
- శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి విశాఖ సిటీ వైపు వచ్చే వాహనచోదకులు ఆదర్శనగర్ వరకు రాకపోకలు సాగించవచ్చు.
- భక్తుల రద్దీ దృష్ట్యా పెదవాల్తేరు, కురుపాం జంక్షన్ నుంచి బీచ్ రోడ్డులో ఎటువంటి వాహనాలను అనుమతించరు.
- పెదవాల్తేరు, కురుపాం టవర్స్ జంక్షన్ నుంచి వెళ్లే వాహనదారులను అనుమతించరు. అలాగే విశాలాక్షినగర్ బీచ్ రోడ్ నుంచి కురుపాం వైపు వాహనదారులను అనుమతించరు. వీరు జాతీయ రహదారి వైపుగా ప్రయాణించి గమ్యస్థానానికి చేరుకోవాలి.
- హనుమంతువాక, వెంకోజీపాలెం వద్ద భక్తులు రహదారి దాటే సమయంలో వాహనదారులకు కొంత మేర అసౌకర్యం ఉన్నప్పటికీ.. జాతీయ రహదారిపై మాత్రమే ప్రయాణించాలి.
- జోడుగుళ్లపాలెం నుంచి హనుమంతవాక వైపు వాహనాల రాకపోకలకు అనుమతి లేదు. ఆయా పరిసర ప్రాంతవాసులు విశాలాక్షినగర్ రోడ్డులో ప్రయాణించి ఎస్‌బీఐ జంక్షన్ వద్ద జాతీయ రహదారికి చేరుకోవాలి.
- సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి వెంకోజీపాలెం జంక్షన్ వైపు ఎటువంటి వాహనాలను అనుమతించరు.
- ఆరిలోవ హెల్త్ సిటీకి వెళ్లాల్సిన వారు ఆదర్శనగర్ ఓల్డ్ డెయిరీ ఫారం నుంచి ఆరిలోవ మీదుగా చేరుకోవాలి.
- అడవివరం జంక్షన్ నుంచి హనుమంతవాక జాతీయ రహదారికి వచ్చే వాహనాలకు అనుమతి లేదు.
- వెంకోజీపాలెం నుంచి అప్పుఘర్ వైపు వెళ్లే భక్తుల రద్దీ దృష్ట్యా వాహనాలను అనుమతించరు.
- అనకాపల్లి, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ వెళ్లాల్సిన అన్ని ప్రైవేటు వాహనాలు, ట్రావెల్ బస్సులు ఆనందపురం వద్ద మళ్లించనున్నారు.
- విశాఖ రైల్వేస్టేషన్, ఎయిర్‌పోర్ట్, బస్ స్టేషన్, గాజువాక వైపు వెళ్లే అన్ని వాహనాలు ఆనందపురం నుంచి పెందుర్తి మీదుగా చేరుకోవాలి.
- తగరపువలస, భీమిలి నుంచి ఎస్ఏడీ జంక్షన్, గోపాలపట్నం మధ్య ఉన్న వాహనదారులు 20న వారి పనులను మధ్యాహ్నం ఒంటిగంటలోగా ముగించుకుని ఇళ్లకు చేరుకుంటే ఎటువంటి అసౌకర్యం ఉండదు.
- విజయనగరం నుంచి నీలకుండీల జంక్షన్ మీదుగా వచ్చే భక్తులు అడవివరం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలపాలి.
- హనుమంతువాక జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను సెంట్రల్ జైలు దగ్గరలో ఉన్న కొత్త గోశాల వద్ద పార్కింగ్ చేసుకోవాలి.
- ఎస్ఏడీ, పెందుర్తి నుంచి వచ్చే అన్ని వాహనాలు వేపగుంట జంక్షన్ మీదుగా సింహపురి కాలనీ చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో, అలాగే ఓల్డ్ గోశాల వద్ద సాయి నగర్ కాలనీలో నిలపాలి.

అదిగో పులి!



అడుగు జాడలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

కొమ్మాది: అదిగో పులి... అవే అడుగు జాడలు అంటూ సాగర్‌నగర్‌లో గురువారం ఉదయం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. సాగర్‌నగర్ కాలనీలో వేకువజామున 4 గంటల సమయంలో ఎల్ఐజీ-ఏ గృహ సముదాయంలో నివాసం ఉంటున్న ప్రసాద్ అనే వ్యక్తి వాకింగ్ కోసం బయటకు వచ్చాడు. ఆ సమయంలో ఆయన ఇంటి ఎదురుగా రోడ్డుపై పులి ఉందని భావించి తిరిగి ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని కిటికీ నుంచి దానిని గమనించాడు. అది అక్కడ నుంచి సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ వైపుగా వెళ్లిందని ఆయన తెలిపాడు. ఈ విషయం సాగర్‌నగర్ కాలనీ మొత్తం వ్యాపించడంతో అందరిలోనూ తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. స్థానికుల సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని అడుగులను పరిశీలించారు. అవి అడవిపిల్లి జాతికి చెందిన ఓ పిల్లి కాలి ముద్రలని అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ ఎల్లారావు తెలిపారు. స్థానికులు వీరి మాటలు నమ్మకపోవడంతో అధికారులు తమ వద్ద ఉన్న పులి, పిల్లి ఫొటోలను చూపించారు. అవి గమనించిన స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

అసిస్టెంట్ లోకో పైలట్ బలవన్మరణం



చందన్(ఫైల్)

గోపాలపట్నం: క్షణికావేశంలో చేసిన తప్పిదం ఆ కుటుంబంలో విషాదం నింపింది. లోకో పైలట్ బలవన్మరణంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. కొత్తపాలెం గణేష్‌నగర్‌లో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. బిహార్ రాష్ట్రానికి చెందిన చందన్‌కుమార్(33) వాల్తేర్ రైల్వే డివిజన్‌లో అసిస్టెంట్ లోకో పైలెట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొత్తపాలెం గణేష్‌నగర్‌లో భార్య, ఏడేళ్ల పాప, ఐదేళ్ల బాబుతో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి పిల్లలు అల్లరి చేస్తుండటంతో తల్లి లాల్‌మున్ని కుమారి వారిని కొట్టింది. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. క్షణికావేశంలో చందన్ కుమార్ పడక గదిలోకి వెళ్లి.. ఫ్యాన్‌కు బెడ్‌షీట్ కట్టుకుని ఉరి వేసుకున్నాడు. ఎంత సేపటికీ బెడ్‌రూమ్ తలుపులు తీయకపోవడంతో ఆమె ఆందోళన చెందింది. తలుపులు తెరిచి చూసే సరికి భర్త ఫ్యాన్‌కు వేలాడుతున్నాడు. స్థానికుల సాయంతో అతన్ని కిందకు దించింది. అప్పటికే అతను మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించింది. గురువారం ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. ఘటనపై వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలపై దాడులు సహించేది లేదు

- ప్రేమ పేరుతో వేధించినా, ఇబ్బందులు పెట్టినా వెంటనే సమాచారం ఇవ్వండి
- ముందస్తు అరెస్టు, రౌడీషీట్, నగర బహిష్కరణ చర్యలు తీసుకుంటాం
- మీడియాతో సీపీ శంఖబ్రత బాగ్చి



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: మహిళలపై దాడులు చేసే సహించేది లేదని, అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. పోలీస్ సమావేశ మందిరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అటువంటి ఆకతాయిలపై చర్యలు తీసుకుంటామని, మహిళలకు భద్రత కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వేధింపులకు పాల్పడే వారిని తేలికగా తీసుకుంటే ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందన్నారు. అఘాయిత్యాలకు పాల్పడే వారిపై రౌడీషీట్, ముందస్తు అరెస్టు, నగర బహిష్కరణ వంటి చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. పెదగంట్యాడలో బాలిక తల్లిపై దాడి చేసిన యువకుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

అందరి సహకారం అవసరం

తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని కమిషనర్ తెలిపారు. భవిష్యత్తులో మహిళలపై దాడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పోలీస్ శాఖలో సిబ్బంది కొరత ఉందని, శాంతిభద్రతలు, నేరాలు, ట్రాఫిక్, బందోబస్తు విధుల్లో నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. పోలీసులు మనుషులేనని వారికి కొంత విశ్రాంతి అవసరమని, అందరి సహకారం ఉంటే మహిళలపై దాడులను పూర్తిగా అరికట్టవచ్చని సూచించారు. సమాజంలో ఎక్కడో ఒకచోట నేరగాళ్లు ఉంటారని, ప్రజల సహకారంతోనే వారిని నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. ఎక్కడైనా మహిళలను వేధించిన వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు గానీ, లేదా తన నెంబర్ 7995095799కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

స్కూళ్లు, కాలేజీల వద్ద నిఘా

స్కూళ్లు, కాలేజీల వద్ద ఆకతాయిల ఆగడాలను అరికట్టడానికి ఆయా ప్రాంతాల్లో నిఘా పెట్టినట్లు చెప్పారు. గంజాయితో పాటు ఈవ్‌టీజర్ల పనిపట్టడానికి డెకాయ్ పార్టీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అలాగే డిపార్టుమెంట్‌లో ఎవరైనా లంచం డిమాండ్ చేసినా, అవినీతికి పాల్పడితే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ ఫక్కీరప్ప, డీసీపీ-2 తుహీన్ సిన్హా పాల్గొన్నారు.

వేమిరెడ్డి హత్యలో జనసేన నాయకుడి హస్తం?

కనకారావుపై పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతుడి భార్య



జనసేన నాయకుడు కరణం కనకారావు

అక్కిరెడ్డిపాలెం: విశ్రాంత ఆర్మీ ఉద్యోగి వేమిరెడ్డి అప్పలనాయుడు హత్య కేసులో జనసేన నాయకుడు కరణం కనకారావు హస్తం ఉందని మృతుడి భార్య సుజాత గాజువాక పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. గాజువాక జగ్గు జంక్షన్ సమీపంలోని శ్రీకృష్ణానగర్ వద్ద దివ్యాంగుడు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి వేమిరెడ్డి అప్పల నాయుడును ఈ నెల 15న బంక రాము, అతని బంధువు బంకా అశోక్ హత్య చేసిన సంగతి తెలిసిందే. మృతుడి భార్య ఫిర్యాదుతో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. వేమిరెడ్డి గాజువాకలో కనకారావు, బంక రాముతో పాటు మరి కొందరు జనసేన నాయకులతో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ.. వారితో సన్నిహితంగా ఉండేవాడని సమాచారం. వై జంక్షన్ వద్ద ఓ స్థలం విక్రయించగా.. దానిపై వచ్చిన కమీషన్ విషయంలో కొద్ది రోజులుగా కనకారావు, వేమిరెడ్డి మధ్య గొడవలు ఉన్నాయి. దీంతో కనకారావు స్క్రాప్ వ్యాపారి రామును వేమిరెడ్డి హత్యకు పురిగొల్పాడని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. పలుమార్లు ఫోన్‌లో, ఇంటికి వచ్చి తన భర్తను చంపుతానని కనకారావు బెదిరించాడని వివరించారు. కాగా.. కనకారావు జగ్గు జంక్షన్ పరిసర ప్రాంతాల్లో పలు వివాదాస్పద స్థలాలు అమ్మి రూ.కోట్లు కూడబెట్టాడని ఆ ప్రాంత నాయకులు చెబుతున్నారు. పలువురు నిరుద్యోగులను విదేశాలు పంపుతామని మోసం చేసిన ఆయనపై గాజువాక పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్ లేకపోయినా.. ఏపీ టెక్నికల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ ఓనర్స్ అసోసియేషన్ అని ఏర్పాటు చేసి అధ్యక్షుడిగా కనకారావు వ్యవహరిస్తున్నాడు. ఇక రాముకు కూడా ఓ స్థలం విషయంలో వేమిరెడ్డితో విభేదాలు ఉన్నాయి. ఈ హత్య కేసులో కనకారావు పాత్ర స్పష్టంగా ఉందని.. అయినా ఎందుకు అరెస్ట్ చేయడం లేదని మృతుని బంధువులు పోలీసులను ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటన జరిగిన తర్వాత కనకారావు ఎవ్వరికీ అందుబాటులో లేడని సమాచారం. దీనిపై గాజువాక సీఐను వివరణ కోరగా.. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కనకారావు పాత్రపై విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలి



ర్యాలీలో పాల్గొన్న జిల్లా అధికారులు, వివిధ వర్గాల ప్రజలు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

బీచ్‌రోడ్డు: ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీట్ బెల్ట్‌లను తప్పనిసరిగా వినియోగించి.. రహదారి నిబంధనలకు పాటించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పిలుపునిచ్చారు. హెల్మెట్ ఆవశ్యకత, ప్రయోజనాలు తెలుపుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం బీచ్‌రోడ్డులో వన్ కే పేరుతో చైతన్య ర్యాలీ నిర్వహించారు. బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద కలెక్టర్ హరేందిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో కలిసి ఆయన జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుంచి బీచ్‌రోడ్డులోని పోలీస్ మెస్ వరకు ఉత్సాహంగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వన్ కే వాక్ చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు లేని నగరంగా విశాఖను తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ హెల్మెట్ లేని డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని, అందరూ తప్పకుండా వినియోగించాలని సూచించారు. అసౌకర్యం, ఇతర కారణాలతో హెల్మెట్ వాడకపోవడం సరికాదని హితవు పలికారు. అతివేగం, నిర్లక్ష్యం కారణంగా ఎదుటివారిని ప్రమాదంలోకి నెట్టొద్దని సూచించారు. సీపీ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తామని, విశాఖను రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా నిలబెడతామన్నారు. విశాఖ వాసుల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, పలువురు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, పోలీస్ జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, అంబేడ్కర్ లా కాలేజీ ఆచార్యులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. రాయల్స్ ఎన్ ఫీల్డ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ చేపట్టారు.

ఏ తల్లి చేసిందో ఈ పాపం?

కాలువలో శిశువు మృతదేహం

మల్కాపురం: ఆ తల్లికి మనసు ఎలా వచ్చిందో.? మరికొద్ది రోజుల్లో ఈ ప్రపంచాన్ని చూస్తానని ఆశపడిన ఆ చిన్నారిని.. గర్భంలోనే చిదిమేసింది. నిర్దాక్షిణ్యంగా వీధి కాలువలో విడిచిపెట్టి.. పేగుబంధాన్ని తెంచుకుంది. వివరాలివీ.. జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం కారడవారి వీధి వద్ద గల బోరుబావి పక్కన వీధి కాలువలో శిశువు మృతదేహం పడి ఉంది. గురువారం తెల్లవారుజామున ఆ కాలువ పక్కన గల ఇంటి యజమానురాలు అటువైపుగా చూడగా.. అక్కడ చిన్నారి మృతదేహం చూసి కలవరం చెందింది. ఈ విషయాన్ని స్థానికులకు తెలియడంతో వారంతా అక్కడకు చేరుకుని.. పసిపాప మృతదేహాన్ని చూసి తల్లడిల్లారు. ఏ తల్లి చేసిందో ఈ పాపం అంటు వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నాయకుడు పోతబత్తుల శ్రీను సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీకి సమాచారం ఇవ్వగా.. ఆయన మల్కాపురం పోలీసుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. సీఐ విద్యాసాగర్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఈ ప్రాంతంలో గర్భిణుల వివరాలను ఆశ కార్యకర్త నుంచి సేకరించారు. శిశువు గర్భంలోనే చనిపోయిందా లేదా ఆడ పిల్ల అని భావించి గర్భస్రావం చేయించారా అనే కోణంలో సీఐ విచారణ చేపడుతున్నారు. ఈ ఘటన సమాజంలో క్షీణించిన మానవత్వ విలువల స్థితిని ప్రతిబింబిస్తోంది.

రిమాండ్ ఖైదీ పరారీ

మార్కాపురం: విశాఖపట్నం నుంచి గుంతకల్లుకు రైలులో తీసుకెళ్తున్న రిమాండ్ ఖైదీ ప్రకాశం జిల్లా మార్కాపురం రైల్వేస్టేషన్‌లో దిగి పరారైన ఘటన బుధవారం అర్ధరాత్రి జరగ్గా, గురువారం వెలుగులోకి వచ్చింది. అయితే, ఆ ఖైదీని గుంతకల్లు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే... అనంతపురం జిల్లా, గుత్తి మండలం, కొత్తపల్లికి చెందిన నరేశ్ గంజాయి రవాణా కేసులో పట్టుబడి రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అనారోగ్యంగా ఉండటంతో పోలీసులు విశాఖపట్నం తీసుకెళ్లి చికిత్స చేయించి మళ్లీ గుంతకల్లు తీసుకొచ్చేందుకు బుధవారం ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. రాత్రి పదిన్నర గంటల సమయంలో మార్కాపురంలో రైలు ఆగిన వెంటనే బాత్రూమ్‌కు వెళ్తానని చెప్పి కిందకు దిగాడు. మళ్లీ రైలు ఎక్కలేదు. రైలు కొద్దిదూరం వెళ్లిన తర్వాత ఎస్కార్టు పోలీసులకు నరేశ్ కనిపించకపోవడంతో తప్పించుకున్నట్లుగా భావించి ఫోనులో మార్కాపురం రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇదే విషయాన్ని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు తెలపడంతో తప్పించుకున్న రిమాండ్ ఖైదీ నరేశ్ కోసం మార్కాపురం నుంచి గుంతకల్లు మధ్య ఉన్న పోలీసుస్టేషన్ల పరిధిలో తనిఖీ చేశారు. నరేష్ మార్కాపురంలోనే అమరావతి రైలు ఎక్కి గుంతకల్లులో దిగడంతో పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

మహిళపై దాడి చేసిన యువకుడి అరెస్టు

రౌడీషీట్ తెరిచిన పోలీసులు

పెదగంట్యాడ: ప్రేమ పేరుతో యువతిని వేధించడంతో పాటు వాళ్ల ఇంట్లోకి అక్రమంగా చొరబడి యువతి తల్లిపై దాడి చేసి కత్తితో గాయపర్చిన సిద్ధూ అనే యువకుడిని అరెస్టు చేశామని డీసీపీ-2 తుహిన్ సిన్హా తెలిపారు. అతడిపై గతంలో గాజువాక పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు కూడా ఉండడంతో రౌడీషీట్ తెరిచామని వివరించారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండలంలోని గొంతివానిపాలెంలో సింగనపల్లి కేశవరావు భార్య సావిత్రి, ఇద్దరు కుమార్తెలతో నివాసం ఉంటున్నాడు. అతని పెద్ద కుమార్తె డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన సిద్ధూ అనే యువకుడు ఏడాది కాలంగా ఆమెను ప్రేమిస్తున్నానంటూ వేధిస్తున్నాడు. యువతి తండ్రి కేశవరావు ఆ యువకుడిని పలుమార్లు హెచ్చరించడంతోపాటు అతడి తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పాడు. అయినా ఆ యువకుని తీరులో మార్పు రాకపోగా కేశవరావుపై దాడి చేశాడు. దీంతో ఆయన గాజువాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా... పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత ఆ యువకుడు ఈ నెల 16న రాత్రి 9 గంటల సమయంలో యువతి ఇంట్లోకి అక్రమంగా కత్తితో చొరబడ్డాడు. అతన్ని అడ్డుకునే ప్రయత్నం చేసిన యువతి తల్లిపై కత్తితో దాడి చేసి గాయపర్చాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు ఒక్కసారిగా రావడంతో అతడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి సావిత్రి ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

మూడు బృందాలతో గాలింపు : సిద్ధూని పట్టుకునేందుకు హార్బర్ ఏసీపీ మోసెస్ పాల్ నేతృత్వంలో మూడు బృందాలను ఏర్పాటు చేశారు. గంగవరం రోడ్డులోని విశాఖ విమల విద్యాలయం వద్ద గురువారం యువకుడిని పోలీసు బృందాలు పట్టుకున్నాయని డీసీపీ-2 తుహిన్ సిన్హా తెలిపారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఆ యువకునిపై రెండు కేసులు నమోదు కావడంతో రౌడీషీట్ తెరిచామని తెలిపారు. ఈ కేసులో నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.

కమ్యూనిస్టు నేత 'చంద్ర' భార్య కన్నుమూత



కమలమ్మ

ఉక్కునగరం: కమ్యూనిస్టు ఉద్యమనేత దివంగత చంద్ర వెంకట కృష్ణయ్య సతీమణి చంద్ర కమలమ్మ (82) గురువారం ఉక్కునగరం క్వార్టర్‌లో కన్నుమూశారు. గతంలో కమ్యూనిస్టు ఉద్యమం మీద పోలీసు నిర్బంధం ఉన్న సమయంలో కమ్యూనిస్టు నాయకులకు ఆమె ఆశ్రయం ఇచ్చేవారు. విద్యార్థి యువజన ఉద్యమాల్లో పాల్గొంటున్న అనేక మంది యువ నాయకులకు ఆమె స్ఫూర్తి కలిగించి అభ్యుదయ ఉద్యమాలకు ప్రోత్సాహం అందించేవారు. కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు దివిసీమ ఉప్పెన సమయంలో సహాయ కార్యక్రమాల్లో పాల్గొని బాధితులకు అండగా నిలిచారు. వీరి కుమారుడు చంద్ర వెంకటేశ్వరరావు స్టీల్‌ప్లాంట్‌లో డీజీఎం కాగా, కుమార్తె వైద్యురాలు. కమలమ్మ మృతికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి, విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తదితరులు సంతాపం తెలిపారు.

ఏఆర్‌కు కానిస్టేబుల్ అటాచ్

పద్మనాభం: పద్మనాభం పోలీస్ స్టేషన్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జి.దాలినాయుడును ఏఆర్‌కు అటాచ్ చేశారు. అతనిపై అవినీతి ఆరోపణలు చేస్తూ కొందరు సీపీకి ఫిర్యాదు చేశారు. దీంతో అతన్ని పోలీస్ ఉన్నతాధికారులు ఏఆర్‌కు అటాచ్ చేశారు. గతంలో కూడా అతన్ని ఏఆర్‌కు అటాచ్ చేశారు. మళ్లీ కొంత కాలం తరవాత పద్మనాభం పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. మళ్లీ ఇప్పుడు అతడిని ఏఆర్‌కు అటాచ్ చేయడంపై చర్చనీయాంశమైంది.

లక్ష ఉద్యోగులు సృష్టిస్తా..

బీచ్‌రోడ్డు: విశాఖలో లక్ష ఉద్యోగాలు కల్పించడం తన లక్ష్యమని ఎంపీ శ్రీభరత్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం సీఐఐ జోనల్ కౌన్సిల్ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌర విద్యుత్ ఉత్పత్తి, బయో టెక్నాలజీ, డేటా సెంటర్లు, ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, తదితర సంస్థల ఏర్పాటుకు విశాఖ అనుకూలమైందన్నారు. విశాఖలో మౌలిక సదుపాయాలు కల్పించి.. పారిశ్రామిక అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు.